




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 213 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు బుధవారం 9 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 213 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE WED 9 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## సింగపూర్‌లో అగ్నిప్రమాదం...
## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి గాయాలు



- స్కూలులో జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్
- ప్రమాదంలో బాబు చేతులు, కాళ్లకు గాయాలు
- ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స
- ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో పవన్
- ఈ పర్యటన ముగిసిన తర్వాతే సింగపూర్‌కు జనసేనాని

పెన్ పవర్ డెస్క్:సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ చిక్కుకున్నాడు. పాఠశాలలో జరిగిన ఈ ప్రమాదంలో బాబు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో స్కూల్ సిబ్బంది మార్క్ శంకర్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పవన్‌ను సింగపూర్ వెళ్లాలని పార్టీ నేతలు సూచించారు. అయితే, అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. కురిడి గ్రామానికి వస్తానని మాటిచ్చానని, అక్కడి గిరిజనులను కలిసి

వివరాలు 2లో..



## వాట్ హేపెండ్...
# రత్నాజీ జరా... దేకో...




## స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా అధికారికి నెం-1 బినామి..!

## వసూల్ రాజాలు ఏపిసోడ్ -2

పేరుకు ప్రైవేటు ఉద్యోగం రోజుకు ఐదు వందల రూపాయల మాత్రమే... అప్పడు మీరైతే కనీసం 20 సంవత్సరాలనుంచి ఈ ఉద్యోగం చేస్తున్నాట్టాయితే మీరు ఏంత ఆస్తి కూడా బెట్టగలరు... మహా అయితే ఒ ఐదు లేదా పదిలక్షల లేక ఓ ఇల్లు కొంటారా...? అన్నది క్వశ్చన్ మార్కే... పోనీ టూ వీలర్ కొంటారా... ఓకే ... డామిట్ ఇక్కడ ఈ ప్రైవేట్ ఉద్యోగి ఏకంగా ఓ క్రేటా కారు కొని అందులో ఓ వేయ్యిరూపాయల పెట్రోల్ పోసుకుని పాపం రోజుకు ఐదు వందల రూపాయల ప్రైవేటు ఉద్యోగం కోసం వెళ్తున్నాడంటే మీకేమనిపిస్తుంది....

**బ్యూరో రిపోర్ట్ పెన్‌పవర్, ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా ఏప్రిల్ 08:**

**ఇంకెందుకు ఆలస్యం ఏపిసోడ్-2లోకి వెళ్ళిపోదాం..పదండి**

ఇక అసలు విషయానికి వస్తే ముందు మనము చర్చించుకోవలసిన వ్యక్తులలో మొదటి వ్యక్తి రంప రత్నజీ సుమారు వయస్సు 40 సంవత్సరాలు అసలు మనవాడి సొంత ఊరు కామవరపుకోట రత్నాజీ జంగారెడ్డిగూడెం సబ్ రిజిష్టర్ ఆఫీసులో ఒక ప్రవేట్ వ్యక్తిగా జయినింగ్ అయినప్పటికి సుమారు 20 సంవత్సరములు మనవాడు యీ ఇరవై సంవత్సరమలలో ఎదుగుదల రత్నాజీ స్థాయి ఎంత పెరిగిందంటే..? గవర్నమెంటు అధికారిని నినే (సబ్ రిజిష్టర్) అనే స్థాయికి ఎదిగాడు. మన రత్నాజీ రిజిస్ట్రేషన్ శాఖలో ఒక జిల్లా అధికారికి భినామిగా వున్నాడండోయ్...

వివరాలు 2లో..

" ఆష్టపదుల్లో మొదటి వ్యక్తి నెం-1 రత్నాజీ...
పేరుకు ప్రైవేటు ఉద్యోగి.. యవ్వారం అబ్బో చాలా ఏక్కువే..?
సబ్ రిజిష్ట్రార్‌ను తనదన్నే రీతిలో రోజుకు 500 జీతం కోసం
క్రేటా కారులో వస్తారు... పాపం అంత పేదవాడు మన రత్నాజీ..
ఏంత పేదవాడు అంతే మరో రెండు నెలల్లో రిటైర్డ్ అయ్యే
ఈ శాఖలోనే జిల్లా స్థాయి అధికారికి బినామిగా ఉండి
సుమారు ఏడు కోట్లు ఆస్తులు..? సంపాధించినంత పేదవాడు.
పాపం అయినా 500 రూపాయల జీతం కోసం రోజు
క్రేటా కారులో వచ్చి కూలి పని చేసుకుంటారు, మన రత్నాజీ.

## దేవుడు ఏదో కారణం వల్లే నన్ను ఇంకా బతికించాడు




- తమవారిని లక్ష్యంగా చేసుకున్న వారికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందని హెచ్చరిక
- మహమ్మద్ యూనస్‌కు ప్రజలంటే ప్రేమ లేదని విమర్శ
- అధిక వడ్డీకి రుణాలిచ్చి విలాసవంతమైన జీవితాన్ని గడిపి వచ్చారని విమర్శ

వివరాలు 2లో..

## ప్రపంచానికి మరో మహమ్మారి ముప్పు పొంచి ఉంది...
# అది ఎప్పుడైనా రావొచ్చు

- ఆ మహమ్మారి ఎప్పుడనేది కచ్చితంగా చెప్పలేమన్న టెడ్రోస్
- కరోనా సృష్టించిన విలయం అందరం చూశామని వెల్లడి
- పరిస్థితులు పూర్తిగా చక్కబడే వరకు మరో మహమ్మారి ఎదురు చూడదని వ్యాఖ్య

వివరాలు 2లో..



## స్వాతంత్ర్య సమరంలో పాలుపంచుకోని వాళ్లు ఇప్పుడు పటేల్ వారసులమని చెప్పుకుంటున్నారు

- జాతీయ నాయకులపై బీజేపీ, ఆరెస్సెస్ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపణ
- ఆరెస్సెస్ సిద్ధాంతాలు పటేల్ భావజాలానికి వ్యతిరేకమన్న ఖర్గే
- దేశంలో ప్రాథమిక సమస్యల నుంచి దృష్టిని మరల్చుతున్నారని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:స్వాతంత్ర్య సమరంలో ఏమాత్రం పాలుపంచుకోని వారు ఇప్పుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసులమని చెప్పుకుంటున్నారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దేశం కోసం పోరాడిన జాతీయ నాయకులపై బీజేపీ, ఆరెస్సెస్ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

వివరాలు 2లో..

## మంత్రి పదవిపై సోము వీర్రాజు ఏమన్నారంటే...!

- మంత్రి కావాలని అనుకుంటే 2014లోనే అయ్యేవాడినన్న వీర్రాజు
- కూటమిలో బీజేపీ చేరడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని వెల్లడి
- తమిళనాడులో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా



పెన్ పవర్ డెస్క్:ఏపీ బీజేపీ మాజీ చీఫ్ సోము వీర్రాజు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇటీవలే ఆయన ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్సీ అయిన తర్వాత వీర్రాజు తొలిసారి రాజమండ్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పదవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి కావాలనే కోరిక లేదని... మంత్రి కావాలని అనుకుంటే 2014లోనే అయ్యేవాడినని చెప్పారు. ఎంతో నిబద్ధతతో బీజేపీ కోసం పనిచేశానని తెలిపారు.

వివరాలు 2లో..

## పవన్ కాన్వాయ్ వల్ల జేఈఈ విద్యార్థులకు పరీక్ష ఆలస్యమైందనడం అవాస్తవం

- మొన్న విశాఖలో జేఈఈ పరీక్ష
- పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా చేరుకున్న కొందరు విద్యార్థులు
- పవన్ కాన్వాయ్ కారణంగానే ఆలస్యమైందంటూ ఆరోపణలు
- విచారణకు ఆదేశించిన పవన్ కల్యాణ్
- ప్రెస్ మీట్ పెట్టి వివరణ ఇచ్చిన విశాఖ సీపీ

పెన్ పవర్ డెస్క్:విశాఖలో మొన్న నిర్వహించిన జేఈఈ పరీక్షకు పలువురు విద్యార్థులు ఆలస్యం కావడం, అందుకు పవన్ కల్యాణ్ కాన్వాయ్ కారణం అంటూ దుమారం రేగడం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి జిల్లాలో పర్యటనకు వచ్చారని,

వివరాలు 2లో..



## అమరావతిలో చంద్రబాబు ఇంటి నిర్మాణానికి నేడు శంకుస్థాపన

- బుధవారం ఉదయం సీఎం కుటుంబసభ్యుల భూమి పూజ
- వెలగపూడి సచివాలయం వెనక ఈ9 రహదారి పక్కనే ఇంటి నిర్మాణం
- చంద్రబాబు ఇంటి నిర్మాణంతో అమరావతికి ఒక భరోసా

ఏపీ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంతిల్లు నిర్మించుకోనున్నారు. (ఏప్రిల్ 9) శంకుస్థాపన జరగనుంది. రాజధాని ప్రాంతంలో సీఎం చంద్రబాబు నివాసం ఏర్పాటు చేసుకోవడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. వెలగపూడి సచివాలయం వెనుక, ఈ9 రహదారి పక్కన కొంత భూమిని కొనుగోలు చేసిన చంద్రబాబు, బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి గృహ

వివరాలు 2లో..



## ఏపీలో ఈ నెల 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన కార్యక్రమం



- ఇంటింటికీ మన మిత్ర
- వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన కార్యక్రమం
- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించనున్న సచివాలయ సిబ్బంది
- పర్యవేక్షణ బాధ్యతలు జిల్లా కలెక్టర్లకు అప్పగింత

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ విధానం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విధానాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ నెల 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమం చేపట్టనున్నారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి... వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఎలా పొందాలనే విషయమై ప్రజలకు వివరించనున్నారు. వారు ప్రజల మొబైల్ ఫోన్ లో 955230009 నెంబరును 'మన మిత్ర' పేరిట సేవ్ చేయనున్నారు. 'మన మిత్ర' కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు

వివరాలు 2లో..

## పవన్ కల్యాణ్ కు ఫోన్ చేసి ధైర్యం చెప్పిన ప్రధాని మోదీ

- సింగపూర్ లో అగ్నిప్రమాదంలో గాయపడ్డ పవన్ కుమారుడు
- చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి పవన్ కు ఫోన్ చేసి తెలుసుకున్న ప్రధాని
- సింగపూర్ లో ఎలాంటి సహాయం కావాలన్నా తాను సిద్ధంగా ఉన్నానని హామీ

వివరాలు 2లో..



ఎడిటర్ వ్యూ

## బెదిరిస్తే.. బెదురుతామా ఏందీ..?

### ట్రంప్ హెచ్చరికలపై ఘాటుగా స్పందించిన చైనా..!

బీచైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అదనంగా 50శాతం సుంకాలు విధిస్తామన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రతిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. చైనాపై ప్రతీకార సుంకాలు విధించడం ఏకపక్షమని, రెచ్చగొట్టే చర్యలని ఆ దేశ వాణిజ్య మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతీకార సుంకాలపై తాము సైతం ప్రతీకారంగా సుంకాలను విధించామని.. భవిష్యత్‌లో మరిన్ని సుంకాలు విధిస్తామని స్పష్టం చేసింది. సార్వభౌమత్వం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలను కాపాడుకునేందుకు చైనా ఈ చర్యలు తీసుకుందని తెలిపింది. సాధారణ అంతర్జాతీయ వాణిజ్య క్రమాన్ని కొనసాగించేందుకు ఉద్దేశించిన పూర్తిగా చట్టబద్ధమైన చర్య అని.. చైనాపై సుంకాలు పెంచుతామని అమెరికా బెదిరించడం తప్పు అని పేర్కొంది. ఇది మరోసారి అమెరికా బ్లాక్ మెయిలింగ్ వైఖరిని బహిర్గతం చేసిందని.. దీన్నీ చైనా ఎప్పటికీ అంగీకరించబోదని స్పష్టం చేశారు. యూఎస్ అదే మార్గంలో వెళ్తే.. చైనా చివరి వరకు పోరాడుతుందని చెప్పింది.

**ఇంతకీ ట్రంప్ ఏమన్నారంటే..?**

డొనాల్డ్ ట్రంప్ సోమవారం చేసిన వ్యాఖ్యలపై చైనా మంత్రిత్వశాఖ ఈ వ్యాఖ్యలు చేసింది. ట్రంప్ చైనాపై అదనంగా సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. అమెరికా ప్రకటించిన ప్రతీకార సుంకాలపై చైనా 34శాతం సుంకాలను ప్రకటించింది. అయితే, దీనిపై ట్రంప్ సోమవారం ఘాటుగా స్పందించారు. ఏప్రిల్ 8 నాటికి చైనా ప్రకటించిన సుంకాలను వెనక్కి తీసుకోవాలని హుకూం జారీ చేశారు. లేకపోతే 50శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. కొత్త సుంకాలు 9వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా స్పష్టం చేశారు. దాంతో పాటు చైనాతో జరుపనున్న అన్ని చర్చలు సైతం రద్దవుతాయని స్పష్టం చేశారు. వాస్తవానికి, ఈ నెల 2న భారత్‌పై 26శాతం ప్రతీకార సుంకాలను విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. వియత్నాంపై 46శాతం, చైనాపై 34శాతం, తైవాన్‌పై 32శాతం, దక్షిణ కొరియాపై 25శాతం, జపాన్‌పై 24శాతం, యూరోపియన్ యూనియన్‌పై 20శాతం సుంకాలు విధిస్తున్నట్లు తెలిపారు. ఆయా దేశాలపై అమెరికాపై ఎక్కువ సుంకాలు విధిస్తున్నాయని.. అందుకే ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. దాంతో భారత్ సహా అనేక దేశాల్లో ద్రవ్యోల్బణం, మాంద్యం భయాలు పెరిగాయి. ట్రంప్ సుంకాలను సద్వినియోగం చేసుకుంటూ.. రాబోయే కాలంలో ప్రపంచ మార్కెట్‌కు ప్రత్యామ్నాయ చాంపియన్‌గా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రక్షకుడిగా నిలవాలని చైనా ఆలోచిస్తున్నది. ప్రపంచ దేశాల శ్రేయస్సు తనపైనే ఆధారపడి ఉందనే సందేశాన్ని పంపాలనుకుంటున్నది. అమెరికాతో పోలిస్తే చైనా సైతం స్థిరమైన ఆర్థిక భాగస్వామిగా ప్రపంచ దేశాలకు చూపించాలనుకుంటున్నది. ఈ క్రమంలో ట్రంప్ సుంకాల విషయంలో యూఎస్‌తో చైనా ఢీ అంటే ఢీ అంటున్నది. అమెరికా బెదిరింపులకు తాము భయపడమని.. ఈ తరహా, ఒత్తిడి, బెదిరంపులు మంచిది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి లియు పెంగ్యుని మీడియా ట్రంప్ డెడ్‌లపై ప్రశ్నించింది. దీనికి పెంగ్యు స్పందిస్తూ.. ట్రంప్ టారిఫ్ ఒత్తిడి, బెదిరింపులకు లొంగబోమని.. చైనా మెరుగైన సంబంధాలు కొనసాగించాలంటే ఒత్తిడి, బెదిరింపులకు సరికావన్నారు. చైనా తన చట్టబద్ధమైన హక్కులతో పాటు ప్రయోజనాలను కాపాడుకుంటుందన్నారు.

# వాట్ హేపెండ్... రత్నాజీ జరా... దేకో..

- **మొదటి పేజీ తరువాయి**

మరి మన రత్నాజీ చేతిలో జిల్లా అధికారి వున్నడంటే ఎవరైన మన వాడి మాటా వినవలసిందే కధా.. వినాలి. అంటే మన రత్నాజీ పై అధికారులకు చెయ్యి ఏ విధంగా తడపాలో ఆవిధంగా తడపటంలో మన వాడు సిద్ధహస్తుడు అని బయట కక్షిదారులు, డాక్యుమెంట్ రైటర్స్ కూడా అంతగా పొగుడుతారు..? మన రత్నజీ స్థాయి ఏమిటి అనేది ఒకసారి ఆత్మ పరిశీలన ఆ శాఖ ప్రభుత్వ అధికారులు చేసుకోవలసిన అవసరం ఉంది. అంతే కాదండోయ్ మన వాడు ఆఫీసులోనే వుండి ఎటువంటి దస్తావేజునూ రిజిస్ట్రేషన్ చేయాలో..? ఎంత సొమ్ములు తీసుకొవాలో..? మనవాడి కనుసన్నల్లోనే కధ మొత్తం నడుస్తుంది. మన జిల్లా రిజిష్టర్లు వాడే కారులో మన రత్నజీ సారు క్రిటా కారు వేసుకొన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకి వస్తారు. సబ్ రిజిస్ట్రార్ కూడా అలాంటి కారు వేసుకుని రారేమో..! అలాంటి కారు మన రత్నజీ సారు వేసుకొని వస్తారు. మన రంప రత్నజీ సారు మిగిలిన వారికి జంగారెడ్డి గూడెం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును కొన్ని శాఖలుగా విభజించి మిగతా ఆరుగురికి పదవులు ఇచ్చారు. వీరు చెప్పినట్లు మిగిలిన వారు నడుచుకోవాలి. ఇది గవర్నమెంటు వారి సబ్ రిజిష్టర్ ఆఫీసా లేదా ఒక ప్రవేట్ వ్యక్తి ఆఫీసా అని రిజిస్ట్రేషన్ కు వచ్చిన కక్షిదారులు ఒకే తీరున మాట్లాడుకొవడం ఇప్పుడు చర్చనీయంగా మారింది. ఒక ప్రవేట్ వ్యక్తి అయిన రత్నాజీ, గవర్నమెంటు అధికారిగా ఆఫీసును రూల్ చేస్తుంటే నిజమైన ప్రభుత్వ అధికారి అయిన సబ్ రిజిష్టరు ఏమి చేస్తున్నారో ఆయన ఆలోచనకే వదిలేద్దాం...సబ్ రిజిస్ట్రార్ విషయం ఇంకోక ఎపిసోడ్ లో చర్చింకుకుందా..! రత్నాజీ జిల్లా స్థాయి అధికారికి బినామి కావడంతో రత్నాజీ, సబ్ రిజిస్ట్రార్ సారునీ పట్టించుకొవడం లేదా..? అంటే రత్నాజీ నే అక్కడ కింగ్ మేకర్ అంటున్నారు... లేఖర్లు తోటి ప్రైవేట్ ఉద్యోగులు... ఈ విషయం ప్రస్తుతానికి జిల్లా అధికారులకే వదిలేద్దాం.

ఇన్వేస్టిగేషన్ గోయింగ్ ఆన్ ప్రోపర్టీస్ ఆఫ్ బినామి నౌ ... రత్నాజీ సారు వారు చేసిన పనులు గురించి మరికొన్ని వచ్చే ఎపిసోడ్ –3లో పెన్ పవర్ పాఠకులకు వివరంగా అందిస్తున్నాం.

**ఏపిసోడ్ -3లో**

**మన రత్నాజీ కి అష్టపదులలో రెండవ వారైన గుడెల్లి రమేష్ బాబు, సొంత ఊరు దేవులపల్లి, వీరికి రత్నాజీ సారు యిచ్చినది ఫైనాన్స్ శాఖ, మనలో మూడోవ వారు కోలా అశోక్ సొంత ఊరు మక్కినవారిగూడెం, రత్నాజీ వారికి యిచ్చినది ఐటి శాఖ, నాలుగు వాడు గాడి శివ, సొంత ఊరు భీమవరం, వీరికి శాఖ రికార్డు రూమ్, ప్రభుత్వ ఉద్యోగి అయిన మన సబ్ రిజిష్టర్‌కి పర్సనల్ పిఏ... 2వ వారి వద్ద నుండి వారి ఆస్తులు గురించి వారి శాఖలు గురించి ఎపిసోడ్-3 నుంచి పూర్తి వివరాలు...**

## దేవుడు ఏదో కారణం వల్లే నన్ను ఇంకా బతికించాడు

**పెన్ పవర్ డెస్క్:** దేవుడు తనను ఏదో ఒక కారణం చేత ఇంకా బతికించాడని, త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానని ఆ దేశ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా అన్నారు. ఆమె సోషల్ మీడియా వేదికగా అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా అవామీ లీగ్ సభ్యులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్నవారికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందని ఆమె హెచ్చరించారు. తప్పకుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసంతో ఉండాలని అన్నారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌పై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయనకు ప్రజలంటే ఏమాత్రం ప్రేమ లేదని అన్నారు. అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి ఆయన విదేశాల్లో విలాసవంతమైన జీవితాన్ని గడిపారని ఆరోపించారు. ఆ సమయంలో ఆయన తీరును అర్థం చేసుకోలేకపోయామని తెలిపారు. అతడికి బంగ్లాదేశ్ ఎంతో చేసిందని అన్నారు. యూనస్ వల్ల దేశానికి, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు.

ఆయన సారథ్యంలో బంగ్లాదేశ్ ఉగ్రవాద దేశంగా మారిందని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో ఎన్నో అత్యాచారాలు, హత్యలు, దొంగతనాలు జరుగుతున్నాయని అన్నారు. మీడియాకు చెందిన వ్యక్తులను కూడా లక్ష్యంగా చేసుకుంటారనే భయంతో ఈ నేరాలు బయటకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి, బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు సహా తన కుటుంబం మొత్తం హత్యలకు గురైందని ఆమె ఆక్రోశించారు. నా ద్వారా బంగ్లా ప్రజలకు మంచి చేయాలని ఆ భగవంతుడు కోరుకున్నాడేమోనని, అందుకే తనను రక్షిస్తున్నాడని అన్నారు.

### ప్రపంచానికి మరో మహమ్మారి ముప్పు పొంచి ఉంది...

## అది ఎప్పుడైనా రావొచ్చు

**పెన్ పవర్ డెస్క్:** ప్రపంచానికి మరో మహమ్మారి ముప్పు పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ హెచ్చరించారు. మరో మహమ్మారి అనివార్యమని ఆయన స్పష్టం చేశారు. అయితే అది ఎప్పుడనేది కచ్చితంగా చెప్పలేమని తెలిపారు. డబ్ల్యూహెచ్‌ఓ పాండెమిక్ అగ్రిమెంట్‌పై జెనీవాలో నిర్వహించిన 13వ పునఃప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరోనా వల్ల ప్రపంచం ఎదుర్కొన్న పర్యవసనాలను గుర్తు చేశారు. పరిస్థితులు పూర్తిగా చక్కబడే వరకు మరో మహమ్మారి ఆగదని, అది ఎప్పుడైనా సంభవించవచ్చని హెచ్చరించారు.

అందుకు ఇరవై ఏళ్లు పట్టవచ్చు లేదా రేపే సంభవించవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ మరో మహమ్మారికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కరోనా సృష్టించిన విలయాన్ని మనమందరం చూశామని, ఈ మహమ్మారి కారణంగా అధికారికంగా 70 లక్షల మంది చనిపోయారని చెప్పినప్పటికీ, ఆ సంఖ్య 2 కోట్లు దాటి ఉంటుందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆర్థిక నష్టాన్ని చవిచూసిందని ఆయన పేర్కొన్నారు.

## అమరావతిలో చంద్రబాబు ఇంటి నిర్మాణానికి నేడు శంకుస్థాపన

- **మొదటి పేజీ తరువాయి**

నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. 2014లో రాజధానిగా అమరావతిని ప్రకటించిన తర్వాత, చంద్రబాబు నాయుడు పాలనను ఇక్కడి నుంచే కొనసాగించారు. అయితే, రాజధాని నిర్మాణంపైనే దృష్టి సారించిన ఆయన సొంతిల్లు నిర్మాణం గురించి పెద్దగా పట్టించుకోలేదు. 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, అమరావతిని దేశంలోనే అగ్రగామి రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నారు. ఈ క్రమంలోనే నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేశారు. ఇప్పుడు సొంతిల్లు నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రజలకు భరోసా కల్పించనున్నారు. చంద్రబాబు సొంతిల్లు కట్టుకుంటుండటంతో రాజధాని రైతుల్లోనూ నమ్మకం పెరిగింది. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు చంద్రబాబు స్వయంగా ఇల్లు నిర్మించుకుంటుండడంతో తమకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నారు.

రాజధాని ఎంపిక నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యానికి చంద్రబాబు ప్రాధాన్యతనిచ్చారు. అమరావతిపై కుట్రలు జరిగినప్పుడు రాజధాని రైతులకు అండగా నిలిచారు. ఇప్పుడు ఆయన స్వయంగా ఇల్లు నిర్మించడంతో రాజధాని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర నిధులు, ప్రముఖ సంస్థల ఏర్పాటు, వేగంగా జరుగుతున్న నిర్మాణ పనులతో అమరావతి ప్రాంతంలో సానుకూల వాతావరణం నెలకొంది. చంద్రబాబు నివాస పనులతో అమరావతికి కొత్త శోభ వస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

## పవన్ కాన్వాయ్ వల్ల జేఈఈ విద్యార్థులకు పరీక్ష ఆలస్యమైందనడం అవాస్తవం

- **మొదటి పేజీ తరువాయి**

ఆయన కాన్వాయ్ కారణంగానే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోలేకపోయారంటూ విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, తన కాన్వాయ్ కారణంగా పెందుర్తిలో విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరు కాలేకపోయారనే వార్తలపై విచారణ జరపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కాన్వాయ్ కోసం ఎంతసేపు ట్రాఫిక్‌ను నిలిపారు, పరీక్ష కేంద్రం వద్దకు విద్యార్థులు వెళ్లే సమయంలో ఆ మార్గంలో ట్రాఫిక్ పరిస్థితి ఏమిటి, సర్వీసు రోడ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించారా వంటి అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆయన విశాఖ పోలీసులను కోరారు. ఈ నేపథ్యంలోనే విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి ఈ ప్రకటన చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాన్వాయ్ కారణంగా జేఈఈ (మెయిన్) పరీక్షకు హాజరు కాలేకపోయినట్లు పెందుర్తికి చెందిన కొందరు విద్యార్థులు చేసిన ఆరోపణలను సీపీ ఖండించారు. విద్యార్థుల ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని స్పష్టం చేశారు.

"డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా మేము ఎటువంటి ట్రాఫిక్ ఆంక్షలు విధించలేదు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి," అని అన్నారు. విద్యార్థులే ఆలస్యంగా వచ్చారని, ఆపై పోలీసులపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల సెల్‌ఫోన్‌లను కూడా ట్రాక్ చేశామని సీపీ తెలిపారు. "పోలీసుల వల్ల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది జరగలేదు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్న తర్వాతే డిప్యూటీ సీఎం కాన్వాయ్ అక్కడి నుంచి వెళ్లింది" అని శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు.

## సింగపూర్‌లో అగ్నిప్రమాదం... డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి గాయాలు

- **మొదటి పేజీ తరువాయి**

ఆ తర్వాతే సింగపూర్ వెళ్తానని పవన్ కల్యాణ్ బదులిచ్చారు. ఇవాళ ప్రారంభించాల్సిన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినందున వాటిని పూర్తిచేసి వెళ్తానన్నారు. ఈ పర్యటన ముగిసిన తర్వాత జనసేనాని సింగపూర్ వెళ్లనున్నారు.

## ఏపీలో ఈ నెల 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన కార్యక్రమం

- **మొదటి పేజీ తరువాయి**

అప్పగించింది. ప్రతి ఒక్కరూ వాట్సాప్ గవర్నెన్స్ ను ఉపయోగించుకునేలా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం 250కి పైగా సేవలు అందిస్తోంది. జూన్ నాటికి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 500 రకాల సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆ తర్వాత ఆ సేవలను 1000కి పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

## స్వాతంత్ర్య సమరంలో పాలుపంచుకోని వాళ్లు ఇప్పుడు పటేల్ వారసులమని చెప్పుకుంటున్నారు

- **మొదటి పేజీ తరువాయి**

ఆరెస్సెస్ సిద్ధాంతాలు పటేల్ భావజాలానికి వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. దేశంలో మతపరమైన విభజనలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారత్‌లోని ప్రాథమిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్లుగా దేశం కోసమే పని చేస్తోందని, అలాంటి పార్టీకి దేశంలో వ్యతిరేక పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర దేశం కోసం ఏమీ చేయని వారు ఇప్పుడు తమ పార్టీని అంతం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పటేల్, నెహ్రూ కలిసి దేశం కోసం పనిచేశారని ఖర్గే అన్నారు. వారి మధ్య మంచి సంబంధాలు ఉండేవని, నెహ్రూ అన్ని విషయాలపైనా పటేల్ సలహాలు తీసుకునేవారని అన్నారు. సలహాల కోసం స్వయంగా నెహ్రూనే పటేల్ ఇంటికి వెళ్లేవారని, పటేల్ సౌలభ్యం కోసం సీడబ్ల్యూసీ సమావేశాలు ఆయన ఇంట్లోనే నిర్వహించేవారని తెలిపారు. అలాంటి గొప్ప నాయకులపై బీజేపీ, ఆరెస్సెస్ దుష్ప్రచారం చేస్తున్నాయని ఖర్గే మండిపడ్డారు.

## మంత్రి పదవిపై సోము వీర్రాజు ఏమన్నారంటే...!

- **మొదటి పేజీ తరువాయి**

ఈ జీవితానికి ఇది చాలని అన్నారు.

దేశంలో దమ్మున్న మగాడు ప్రధాని మోదీ అని సోము వీర్రాజు కితాబునిచ్చారు. ఏపీలో కూటమిలో బీజేపీ కలవడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని చెప్పారు. త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆక్వా రైతుల సమస్యలను తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.


మరోవైపు, సోము వీర్రాజు రాజమండ్రి రాక సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. రాజమండ్రిలోని కోటిపల్లి బస్టాండ్ నుంచి స్టేడియం రోడ్డు, బైపాస్ రోడ్డు, జైలు రోడ్డు మీదుగా మంజీరా హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీర్రాజుకు గజమాలలు వేశారు. బాణసంచా, తీన్మార్ డ్యాన్సులతో సందడి చేశారు. ర్యాలీలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితర నేతలు పాల్గొన్నారు. అనంతరం అభినందన సభ జరిగింది. ఈ సభలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ కు ఫోన్ చేసి ధైర్యం చెప్పిన ప్రధాని మోదీ

**పెన్ పవర్ డెస్క్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ అగ్నిప్రమాదంలో గాయపడ్డ సంగతి తెలిసిందే. సింగపూర్ లో మార్క్ శంకర్ చదువుతున్న స్కూల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మార్క్ శంకర్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.

మార్క్ శంకర్ గాయపడ్డ విషయం తెలుసుకున్న ప్రధాని మోదీ... పవన్ కల్యాణ్ కు ఫోన్ చేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలుసుకుని... చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని పవన్ కు చెప్పారు. సింగపూర్ లో ఎలాంటి సహాయం కావాలన్నా తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.

# వైసీపీలో రెడ్డి ... నాన్ రెడ్డి వార్



**విజయవాడ, ఏప్రిల్ 8, పెన్ పవర్:** జగన్ ఎక్కడ మాట్లాడినా అతను నోట్లోంచి వచ్చే మాట నా ఎస్సీలు నా బీసీలు. ఈ నా ఎస్సీలు నా బీసీలు డైలాగే మొన్నటి ఎన్నికల్లో జగన్ కొంపముంచింది. వైసీపీలో పేరుకి ఎస్సీలు, బీసీలు నామస్మరణ చేస్తారే తప్ప . నడిపించేదంతా రెడ్లే. ఎవరు అవునన్నా కాదన్నా వైసీపీ రెడ్ల పార్టీయే. ఈ మాట బయట జనం మాట్లాడుకునేదే కాదు పార్టీలో కూడా అందరూ ఇదే మాట్లాడుకుంటూ ఉంటారు. ఇప్పుడు వైసీపీలో రెడ్డి నాన్ రెడ్డి వార్ రోజు రోజుకి ముదురుతోంది. పార్టీలో రెడ్లకు ప్రాధాన్యం తగ్గించకపోతే భవిష్యత్తు కష్టమవుతుందని ఓపెన్ గానే మిగిలిన కులాల వాళ్లు మాట్లాడేసుకుంటున్నారు. 2019 .24 మధ్య జగన్ పాలన అంతా రెడ్డి రాజ్యమే నడిచింది. ఓటమి తర్వాత పార్టీలో మిగిలిన కులాలు ఓపెన్ గానే రెడ్డి వ్యతిరేక స్వరం వినిపిస్తున్నాయి.ఏపీ రాజకీయాలను రెండు అగ్రకులాలు శాసిస్తున్నాఅనేది జగమెరిగిన సత్యం. వైసీపీ అంటే రెడ్ల పార్టీ. టిడిపి అంటే కమ్మ వాళ్ల పార్టీ. దీనిలో మరో వాదనే లేదు. 2009లో పి అర్ పి ..2014లో జనసేన వచ్చినప్పుడు మాత్రమే కాపులకు కూడా ఒక పార్టీ ఉంది అని జనం మాట్లాడుకున్నారూ. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాపులు పవన్ కళ్యాణ్ కోసం పూర్తిగా జనసేనతో నిలబడ్డారు. పవన్ కళ్యాణ్ కోసమే మూకుమ్మడిగా టిడిపికి కూడా ఓటు వేశారు. మనం ఎన్ని కబుర్లు చెప్పుకున్న ఏపీ రాజకీయాల్ని కమ్మ, రెడ్డి కులాలే ఈరోజుకి శాసిస్తున్నాయి. తెలుగుదేశం వ్యవహార శైలి వైసీపీకి భిన్నంగా ఉంటుంది. టిడిపి అధినాయకత్వం ఎప్పటికీ కమ్మ కులం చేతిలోనే ఉంటుంది. టిడిపి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ,చంద్రబాబు కుటుంబీకులే అవుతారు. అంతేకాక కమ్మ సామాజిక వర్గం ఒక ఓజోన్ లేయర్ లాగా టిడిపిని కాపాడుకుంటూ వస్తుంది. అయితే ఈ భావన ఎక్కడా కనిపించకుండా టిడిపి మొదటినుంచి బీసీలకు, ఇతర కులాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా కలరింగ్ చూపిస్తుంది. అందుకే బీసీ కులస్తుడైన అచ్చం నాయుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా తెర పై పెడతారు. బీసీలకు ఎస్సీలకు పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇస్తున్నట్లే చూపిస్తారు. అంతేకాదు వాళ్ళకి సముచిత గౌరవం కూడా ఉంటుంది. అందువల్ల టిడిపిలో కుల పరమైన అసంతృప్తి సాధ్యమైనంత వరకు రాదు.వైసీపీ విషయానికొస్తే అలా ఉండదు. అది 100% రెడ్ల పార్టీ. ఎవరు ఎలా అనుకున్నా కూడా రెడ్ల కి అన్ని స్థాయిల్లోనూ ప్రాధాన్యం ఇస్తారు.పైకి మాత్రం జగన్మోహన్ రెడ్డి నా ఎస్సీలు, నా బీసీలు అని గట్టిగా అరుస్తుంటాడు. ఆ పార్టీలో ఎస్సీలు, బీసీలు నిర్ణయాత్మక శక్తి కానే కాదు. జగన్ సీఎం గా ఉన్నప్పుడు ఐదుగురు డమ్మీ డిప్యూటీ సీఎం లను పెట్టాడు. ఎస్సీలు ,బీసీలు, ఎస్సీలకు ప్రాధాన్యమిస్తూ డిప్యూటీ సీఎం పదవులు వాళ్ల కేటాయించాడు. కానీ వాళ్లు పూర్తిగా డమ్మీలనే విషయంబయట అందరికీ తెలుసు. అసలు రాజ్యాంగంలోనే లేని డిప్యూటీ సీఎం ఏ కులం వాడికి ఇచ్చినా ఒకటే. ఆ పోస్టుకి ప్రత్యేకంగా పవర్స్ ఉండవు. అది అందరిలాంటి మంత్రి పదమే.ఇక వైసీపీలో రెడ్ల ఆధిపత్యం ఎలా ఉంటుంది అనడానికి ఆ పార్టీలో రీజనల్ ఇన్చార్జిల నియామకమే ఒక ఉదాహరణ. పార్టీకి జగన్ మోహన్ రెడ్డి సెంటర్ పోల్ అయితే నాలుగు స్తంభాలాగా విజయ సాయి రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవహరించేవారు. ఉత్తరాంధ్రాకి ఇన్చార్జిగా జగన్%ఔ%. విజయ్ సాయి రెడ్డిని నియమించాడు. అలాగే రాయలసీమకి ఇంచార్జిగా సజ్జల ఉండేవాడు. కోస్తా జిల్లాలకు మిథున్ రెడ్డి ఇన్చార్జిగా ఉండేవాడు. అసలు విజయసాయిరెడ్డి అనే వ్యక్తికి ఉత్తరాంధ్రకి సంబంధం ఏమిటో ఎవరికి తెలియదు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్ళు విజయ్ సాయి రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాలకు ముఖ్యమంత్రి లా వ్యవహరించాడు.ప్రతి వ్యాపారంలో, రియల్ ఎస్టేట్లో ఆయన వేలు పెట్టాడు. ఉత్తరాంధ్రని అల్లకల్లోలం చేసి వదిలిపెట్టాడు. అక్కడ వైసీపీ దారుణ ఓటమికి విజయ్ సాయి రెడ్డి ప్రధాన కారణం. ఇక మిథున్ రెడ్డికి కోస్తా జిల్లాలకి ఏ సంబంధము ఎవరికీ అర్థం కాదు. సాయిరెడ్డి అంతా అల్లకల్లోలం చేయకపోయినా మిథున్ రెడ్డికి కోస్తా జిల్లాల పాలిటిక్స్ అసలు అర్థం కాలేదు. కోస్తా జిల్లాల్లో మిథున్ పూర్తిగా వైఫల్యం చెందాడు. ఇక సజ్జల రాయలసీమ వ్యవహారాలను పట్టించుకున్నదే లేదు. ఆయన నెంబర్ 2 లా వ్యవహరించి మొత్తం పార్టీని ముంచాడు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో మిగిలిన రెడ్లు అంతా సామంత రాజుల్లా వ్యవహరించారు. చివరికి ఓటమి తర్వాత కూడా మళ్లీ సాయిరెడ్డి నేను తీసుకెళ్లి ఉత్తరాంధ్రకి ఇంచార్జిగా పెట్టాడు జగన్. ఆ ప్రాంతం నాశనం అయిన%ఔ%.. తన పార్టీ నాశనం అయిన కూడా సాయిరెడ్డి పై మమకారం పోలేదు జగన్ రెడ్డికి. సాయి రెడ్డి నిష్క్రమణ తర్వాత జ్ఞానోదయం అయ్యింది.చివరికి కాపు కులస్తుడైన కురసాల కన్నబాబుని ఇప్పుడు ఉత్తరాంధ్రకి ఇంచార్జిగా పెట్టారు. ఇది కేవలం ఉత్తరాంధ్రకి సంబంధించిన వ్యవహారమే కాదు పార్టీలో ఇప్పటికీ రెడ్ల హవాయే నడుస్తుందని మిగిలిన కులాల నాయకులు అంతర్గతంగా ఆవేదన వ్యక్తం చేస్తూ ఉంటారు. పేరుకి ఎస్సీలు, బీసీలు అని నినాదాలు చేసినప్పటికీ పెద్ద పోస్టులన్నిటిలోనూ రెడ్లే ఇప్పటికీ వైసీపీలో చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా జగన్ చుట్టూ రెడ్లే ఉండేవారు. ధనంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైయస్ అనిల్ రెడ్డి వీళ్లు జగన్ చుట్టూ దడి కట్టేవారు. బొత్స సత్యనారాయణ, ధర్మాన, కారుమూరి నాగేశ్వరరావు, దాడిశెట్టి రాజా, పేర్ని నాని, గుడివాడ నాని లాంటి వాళ్లకు సెకండ్ ప్రయారిటీ మాత్రమే దక్కేది. జగన్ ఆర్థిక వ్యవహారాలని పూర్తిగా రెడ్లు మాత్రమే హ్యాండిల్ చేసేవాళ్లు. చివరికి లిక్కర్ స్కామ్ లో కూడా రాజ్ కసిరెడ్డి కీలక పాత్ర పోషించాడు.వైసీపీలో రెడ్ల ఆధిపత్యం%ఔ% ప్రభావం ఎంతగా ఉంటుందంటే మొన్నటి ఎన్నికల్లో రాయలసీమలో 54 అసెంబ్లీ సీట్లు ఎక్కడ ఒక్క బలిజ కి కూడా సీట్ ఇవ్వకుండా ధైర్యంగా, మొండిగా బరిలోకి దిగాడు జగన్. అదేమని అడిగితే బలిజలు ఈసారి మనకు ఎలాగూ ఓటు వేయరు. కనుక వాళ్లకి టికెట్ ఇచ్చి వృధా అని నిర్మోమాటంగా చెప్పేసాడు జగన్. ఇక జగన్ హయాంలో పార్టీలో రెడ్లే ఎక్కువగా సంపాదించారు. వ్యాపారాలు కూడా భారీగానే చేశారు. విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, మిధున్ రెడ్డి, సుబ్బారెడ్డి ఐదేళ్లలో ఒక్కరోజు కూడా వృధా చేయకుండా కుమ్మి పడేశారు. సాయి రెడ్డి విశాఖలో వ్యాపారాలు విస్తరించాడు. సజ్జల%ఔ%. ఆయన కుమారుడు భార్గవ్ రెడ్డి తెలివిగా పైకి కనబడకుండా మైన్స్, ఎడ్యుకేషన్, స్కూల్స్, టాబ్స్ ఇలాంటి వాటిలో కోట్లు కొట్టేశారు. ఇక లిక్కర్ స్కామ్ మొత్తం మిథున్ రెడ్డి కనుసన్న లోనే జరిగింది. సుబ్బారెడ్డి ఆయన కుమారుడు కాకినాడ సీ పోర్టు, ఎస్సీ జడ్ లో వాటాలు కొట్టేశారు. మిగిలిన కులాల నాయకులకు అవినీతిలో కూడా ఎక్కడ జోక్యం చేసుకోకుండా అడ్డుకున్నారు.ఇప్పుడు అధికారం పోయాక దీనిపై బాగా చర్చ జరుగుతుంది. పార్టీలో రెడ్ల ఆధిపత్యం ఏమాత్రం తగ్గలేదు. మిగిలిన కులాల వాళ్లందర్నీ ప్రెస్ మీట్ లకి, ధర్నాలకి, ఆందోళనలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఇప్పటికీ జగన్ తో క్లోజ్ డోర్ మీటింగ్స్ లో మాట్లాడుకునేది రెడ్లే అని పార్టీలోనే బహిరంగంగా చెప్పుకుంటూ ఉంటారు.ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన కులాల వాళ్ళు పార్టీలో ఉండాలా వెళ్లిపోవాలా అని చర్చించే నాయకులు లేకపోలేదు. టిడిపిలోకి వెళ్తే అక్కడైనా కమ్మ ఆదిపత్యమే కదా%ఔ%. లోకి వెళ్దాం అంటే అది భవిష్యత్తు లేని పార్టీ%ఔ%. తిట్టుకుంటూనో తుమ్ముకుంటునో వైసీపీలోనే ఉండాలా? లేక నిత్యం నిరసన గళం వినిపిస్తూ ఉండాలా అనే మీ మాంసలో కొట్టుమిట్టాడుతున్నారు వైసీపీలో మిగిలిన కులాల నేతలు.

# రాజధానికి మరో .4285 కోట్లు



**విజయవాడ, ఏప్రిల్ 8, పెన్ పవర్:** ఏపీ రాజధాని అమరావతికి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రాజధాని నిర్మాణానికి రూ.4285 కోట్ల నిధులు విడుదల చేసింది. రాజధాని నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులు 25 శాతం విడుదల చేసింది. ఈ నిధులకు కేంద్రం వాటా రూ.750 కోట్లు కలిపి మొత్తం రూ.4285 కోట్లు ఇచ్చింది. అమరావతిలో పనులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 25 శాతం నిధులు అడ్వాన్స్‌గా ఇవ్వాలని సీఆర్డీఏ కేంద్రాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా నిధులను విడుదల చేసింది.ప్రధాని మోదీ ఏపీ రాజధాని అమరావతిలో పర్యటనకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ ఏప్రిల్ మూడో వారంలో ఏపీకి రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటన కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. ఈ కార్యక్రమానికి లక్షల్లో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తుంది. వెలగపూడి సచివాలయం సమీపంలో 250 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పనులు ప్రారంభించారు. సామాన్య ప్రజలతో పాటు వీవీఐపీలు, వీఐపీల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభాస్థలికి చేరుకునేందుకు మొత్తం 8 మార్గాలను గుర్తించారు.రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి. అమరావతి నగరాన్ని రోడ్డు, రైలు, వాయు మార్గాల ద్వారా నేరుగా అనుసంధానించేలా, అత్యధునిక పరిజ్ఞానంతో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. అమరావతిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రైల్వేస్టేషన్‌ను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నెక్కల్లు-పెదపరిమి సమీపంలో దేశంలోకెల్లా అతిపెద్ద రైల్వేస్టేషన్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కోసం ఏపీ ప్రభుత్వం రైల్వేశాఖకు సుమారు 1500 ఎకరాలు అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.అమరావతి రైల్వేలైన్‌ను రెండు దశలుగా చేపట్టాలని కేంద్ర రైల్వేశాఖ ఇటీవల నిర్ణయించింది. మొత్తం 56.53 కి.మీ. రైల్వేలైన్‌లో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి 27 కి.మీ. లైన్‌ను మొదటి దశగా చేపట్టనున్నారు. ఈ రైల్వే లైన్ కోసం రెండు నెలల్లో టెండర్లను ఆహ్వానించనున్నారు. తొలి దశలోనే దాములూరు-వైకుంఠపురం మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ. మేర రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపడతారు. వచ్చే రెండు నెలల్లోగా భూసేకరణ పూర్తి చేయగలమని రైల్వే శాఖ ధీమా వ్యక్తం చేసింది. తొలిదశ పనుల కోసం సుమారు రూ.800 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. తాడికొండ మండలంలో రైల్వే లైన్ కోసం భూములిచ్చేందుకు కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో అక్కడ భూసేకరణ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.అమరావతి రైల్వేస్టేషన్‌ను ఎయిర్ పోర్టు తరహాలో నగర శివారులో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దేశంలోకెల్లా అతిపెద్ద మోడల్ రైల్వేస్టేషన్‌గా అత్యాధునిక సౌకర్యాలతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా దీనిని నిర్మించాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

# నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు బంద్

**విజయవాడ, ఏప్రిల్ 8, పెన్ పవర్:** ఏపీలో ఆరోగ్య శ్రీ సేవలు పూర్తిగా పడకేశాయి. ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.3500కోట్లకు చేరడంతో సేవల్ని నిలిపివేస్తున్నట్టు ఆరోగ్య శ్రీ ఆస్పత్రుల సంఘం ఆశా ప్రకటించింది. ఆరోగ్య శ్రీ బకాయిల విడుదల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 26సార్లు లేఖలు రాసినట్టు ఆస్పత్రుల సంఘం చెబుతోంది.ఏపీలో ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో సేవల్ని నిలిపి వేస్తున్నట్టు ఆస్పత్రుల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం – ఆశా గతనెలలోనే సమ్మె నోటీస్ ఇచ్చింది.కనీసం రూ.1500కోట్లు విడుదల చేస్తే కానీ సేవలు అందించలేమని తేల్చి చెప్పింది. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న బకాయిలతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందించిన సేవలకు రూ. 3500 కోట్ల బకాయిలు పేరుకున్నాయి. ఇప్పటి వరకు 26 సార్లు ప్రభుత్వానికి నిధుల విడుదల కోసం లేఖలు రాసినట్టు ఆస్పత్రుల సంఘం చెబుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శ్రీ స్థానంలో బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా అమలు చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అందించే చికిత్సలకు ధరలు తక్కువగా ఉన్నాయని ఆస్పత్రులు అభ్యంతరం చెబుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 6 నుంచి దశల వారీగా చికిత్సలు నిలిపివేస్తున్నారు.ప్రైవేట్ ఆస్పత్రల్లో ఆరోగ్య శ్రీ ఓపీలు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ సేవల్ని నిలిపివేశారు. దాదాపు మూడు నెలలుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో అరకొరగా సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య శ్రీ సేవల్ని ట్రస్టు ద్వారా కాకుండా బీమా కంపెనీల భాగస్వామ్యంలో అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద అన్ని రకాల చికి త్సలు నిలిపివేస్తామని ఆస్పత్రుల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈవో రవి, అడిషనల్ సీఈవో న్ ప్రసాద్‌బాబు, ఇతర అధికారులు.. ఆషా అధ్యక్షుడు డా. విజయ్ కుమార్, కార్యదర్శి అవినాశ్ ఇతర ప్రతినిధులతో చర్చలు జరుపుతూనే ఉన్నారు.బిల్లులను త్వరితగతిన చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నట్టు ట్రస్టు ప్రతినిధులు ఆస్పత్రుల యాజమాన్యాలకు వివరించారు. తాము ప్రభుత్వానికి ఎన్నో మార్లు విజ్ఞప్తి చేసినా బిల్లుల చెల్లింపుల్లో పురోగతి లేకపోవడంతో విధిలేక సేవలను నిలిపి వేస్తున్నట్టు ఆషా కార్యదర్శి అవినాశ్ వివరించారు. తాము గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆశా తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత విడుదల చేసిన బకాయిలు కంటే నెట్వర్క్ ఆస్పత్రులు అందిం చిన వైద్య సేవల విలువ ఎక్కువగా ఉందని తెలిపింది.

# ఆక్వా రైతులకు గట్టి ఎదురుదెబ్బ

**ఏలూరు, ఏప్రిల్ 8, పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న కీలక నిర్ణయం వల్ల ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా దిగుమతులపై సుంకాలను 3% నుండి 26% వరకు పెంచడంతో, ఏపీ నుంచి ఎగుమతి అయ్యే వనామీ రొయ్యల ధర ఒక్కసారిగా పడిపోయింది. దీని ప్రభావంతో రూ. లక్ష విలువైన రొయ్యలు ఇప్పుడు లక్షా 26 వేలు ఖర్చవుతుండగా, రవాణా, ప్యాకింగ్ తో కలిపి మొత్తం ఖర్చు 50% పెరిగిపోయింది.ఇక ఎగుమతి దారులు ధరలు కేజీకి రూ. 30 నుంచి 50 వరకు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 100 కౌంట్ రొయ్య ధర రూ. 250 ఉండగా, ఇప్పుడు అది రూ. 210కి పడిపోయింది. ఈ నెల 9వ తేదీ నుంచి అమెరికా సుంకం అమల్లోకి రానుంది. ఏటా ఏపీ నుంచి 17.2 లక్షల టన్నుల వనామీ రొయ్యలు అమెరికాకు ఎగుమతి అవుతుండగా, ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే రోజుకు 2 వేల టన్నులు వెళ్తున్నాయి.రైతుల ఆందోళనల నేపథ్యంలో, సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. రొయ్యలపై సుంకాల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మత్స్యరంగం ఏపీ జీడీపీలో 11% వాటాతో కీలకంగా ఉందని, ఈ సంక్షోభ సమయంలో రైతులకు అండగా ఉండాలని ఆయన లేఖలో వివరించారు. అధిక సుంకాల వల్ల విదేశీ ఆర్డర్లు రద్దవుతుండటంతో పాటు, గిడ్డంగుల్లో నిల్వ స్థలాలు కూడా లేవని ఆయన వెల్లడించారు.ఇక కేంద్రం ఆక్వా రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ భరోసా ఇచ్చారు. అయితే, రైతులు ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వ్యాపారవర్గాలే ధరలు కుదించే సిండికేట్‌గా మారారని ఆరోపిస్తూ, రైతులకు అండగా పోరాడతామని స్పష్టం చేశారు.

**ప్రభుత్వమే దోచుకుంటుంది...**

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ సీఎం జగన్ ప్రశ్నించారు. 100 కౌంట్ రొయ్యల ధర అకస్మాత్తుగా రూ.280 నుంచి దాదాపు రూ.200- రూ.210కి పడిపోయిందని చెప్పారు.చంద్రబాబు నాయుడు ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలో ఉంటే నిద్రపోతున్నారా? అమెరికా టారిఫ్‌ల దెబ్బ ఒకటైతే, ఆపేరు చెప్పి మీ పార్టీకి చెందిన వ్యాపారులంతా సిండికేట్ అయి రైతులను దోచుకుతింటుంటే ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు? రోజు రోజుకూ ధరలు పతనం అవుతున్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదు?ప్రభుత్వ స్థాయిలో ఒక రివ్యూ చేసి, గట్టి చర్యలు ఎందుకు తీసుకోవడంలేదు? రైతులంతా గగ్గోలు పెడితే, మీడియా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలదీస్తే కేంద్రానికి ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసం? ఇక ప్రభుత్వం ఉండీ ఏం లాభం? 100 కౌంట్ రొయ్యల ధర అకస్మాత్తుగా రూ.280 నుంచి దాదాపు రూ.200- 210కి పడిపోయింది. ఈ ధరలు ఇంకా తగ్గుతున్నా, క్రాప్ హాలిడే తప్ప వేరే మార్గం లేదని రైతులు కన్నీళ్లు పెడుతున్నా ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ధాన్యం, పత్తి, పొగాకు, మిర్చి, కంది, పెసలు, మినుము, అరటి, టమోటా ఇలా ప్రతి పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోయింది. దళారులు రైతుల కష్టాన్ని దోచుకుతింటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సమస్యలను ప్రస్తావిస్తే మీ ప్రభుత్వం ఎదురుదాడి చేసి తప్పించుకుంటోంది తప్ప ఎక్కడా బాధ్యత తీసుకోవడంలేదు. ఇప్పుడు ఆక్వా విషయంలోనూ అంతే.ఎగుమతుల్లోనూ, అలాగే విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించడంలోనూ రాష్ట్ర ఆక్వారంగం దేశంలోనే నంబర్ వన్. అలాంటి రంగాన్ని మరింతగా ఆదుకోవడానికి ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీని మా హయాంలో ఏర్పాటు చేశాం. ఆక్వా సీడ్, ఫీడ్ ధరలను నియంత్రించడంతోపాటు నాణ్యత పాటించేలా ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చాం. సిండికేట్‌గా మారి దోపిడీచేసే విధానాలకు చెక్ పెడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా రొయ్యలకు ధరలు నిర్ణయించాం.కొవిడ్ సమయంలో దాదాపు ఐదేళ్ల క్రితం 100 కౌంట్‌కు, ఆ రోజుల్లో కనీస ధరగా రూ.210లు నిర్ణయించి రైతులకు బాసటగా నిలిచాం. మూడుసార్లు ఫీడ్ ధరలు తగ్గించాం. ఇప్పుడు ఫిష్ ఆయిల్, సోయాబీన్ సహా ముడిసరుకుల దిగుమతులపై సుంకం దాదాపు 15% నుంచి 5% తగ్గినా ఈ కూటమి ప్రభుత్వంలో ఫీడ్ ధరలు ఒక్కపైసా కూడా తగ్గలేదు. మేం ఏర్పాటు చేసిన నియంత్రణ బోర్డు అందుబాటులో ఉన్నాసరే రేట్లు తగ్గడంలేదు.గతంలో చంద్రబాబు హయాంలో ఆక్వాజోన్ పరిధిలో కేవలం 80-90వేల ఎకరాలు ఉంటే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ జోన్ పరిధిలోకి 4.22 లక్షల ఎకరాలు తీసుకువచ్చాం. ఆక్వా రంగంలో మొత్తం 64వేల విద్యుత్ కనెక్షన్లు ఉంటే అందులో జోన్ పరిధిలో ఉన్న 54వేల కనెక్షన్లకు రూ.1.50కే యూనిట్ కరెంటు అందించాం. దీనికోసం రూ.3,640 కోట్లు సబ్సిడీ కింద ఖర్చుచేశాం. ఆక్వాజోన్స్‌లో ఉన్న ఆర్బీకేల్లో ఫిషరీస్ గ్రాడ్యుయేట్లను ఆక్వా అసిస్టెంట్లుగా నియమించి రైతుకు చేదోడుగా నిలిచి, ఎప్పుడు సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపించాం. ఇప్పుడు ఆర్బీకే వ్యవస్థను నాశనం చేసి, అత్యధికంగా ఆర్జిస్తున్న రంగాన్ని దెబ్బతీస్తున్నారు.చంద్రబాబు.. ఇప్పటికైనా కళ్లు తెరవండి. వెంటనే రొయ్యలకు ధరలు ప్రకటించి, ధరల పతనాన్ని అడ్డుకోండి. అమెరికా టారిఫ్‌ల పేరుతో రైతుల్ని దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి. ఈ టారిఫ్‌లు అన్నవి కేవలం మన దేశానికి మాత్రమే పరిమితమైనవి కావు, ఇక ముందుకూడా ఇవి కొనసాగుతాయి. ఊరికే ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం కాదు” అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

# ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవం పండుగ

**కడప ఏప్రిల్ 8, పెన్ పవర్:** ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరగనున్న సీతారాముల కల్యాణోత్సవం పండుగ వాతావరణంలో భక్తులందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్టలో జరిగిన సమీక్షాలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర విభజన అయ్యాక దేవాదాయ శాఖ నుంచి ఒంటిమిట్ట ఏకశిలానగరాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో టీటీడీలో విలీనం చేశారని, అప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని గుర్తు చేశారు. 2019లో కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించాలని, అన్నమయ్య నివసించిన ప్రాంతం కనుక ఇక్కడే టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించాలని సీఎం భావించారని గుర్తు చేశారు.ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగకు ముత్యాల తలంబ్రాలు సమర్పించడానికి సీఎం చంద్రబాబు వస్తున్నారని వెల్లడించారు.ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గట్టుగా టీటీడీ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కోరారు. సీఎం వచ్చి వెళ్లేంత వరకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైవే సెక్టార్ లలో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుండి అంబులెన్స్ లను అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు , డ్రోన్ కెమెరాలు పెంచాలని, వేసవి నేపథ్యంలో ఫైర్ సర్వీస్ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు వెలుపలికి సులువుగా వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఒంటిమిట్ట ఆలయాన్ని ఒక గొప్ప పుణ్య క్షేత్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.కడప జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ, అందరూ కలిసికట్టుగా సమిష్టిగా పనిచేసి సీతారాముల కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కల్యాణ వేదిక ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో కల్యాణ వేదిక వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతులు ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. కడప జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పటిష్ట బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా, వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదం కౌంటర్లు, లైటింగ్, వైద్యశిబిరాలు, మరుగుదొడ్లు, అదనపు పారిశుద్ధ్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమీక్షకు ముందు కల్యాణోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లపై మంత్రులకు జిల్లా కలెక్టర్, టీటీడీ జేఈవో, జిల్లా ఎస్పీ, టీటీడీ సీవీఎస్వోలు నివేదించారు.

## రహానే రాణించినా కోల్‌కతా గెలవలేదు..

# లఖ్‌నవూదే విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. లఖ్‌నవూ నిర్దేశించిన 239 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసి, విజయానికి నాలుగు అడుగుల దూరంలో ఆగిపోయింది. కోల్‌కతా ఓపెనర్లు డికాక్ 15(9), సునీల్ నరైన్ 30 (13) ధాటిగా ఆరంభించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపో యారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ రహానె 61 (35 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సలు), వెంకటేశ్ అయ్యర్ 45 (29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా ఆడారు. ఫోర్లు, సిక్సలు కొడుతూ, వికెట్ల మధ్య పరుగులు తీస్తూ మ్యాచ్‌ను నెమ్మదిగా కోల్‌కతా వైపు తిప్పారు.ఒకానొక దశలో కోల్‌కతా విజయావకాశాలు మెరుగ్గా కనిపించాయి. అయితే, శార్దూల్ ఠాకూర్ వేసిన 13 ఓవర్ మొత్తం మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. మొదటి ఐదు బంతులు ఐదు వైడ్‌లు వేసి చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్న శార్దూల్ చివరి బంతికి రహానె వికెట్ తీయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. అప్పటి నుంచి నెమ్మదిగా కోల్‌కతా చేతుల్లో నుంచి లఖ్‌నవూ మ్యాచ్‌ను లాగేసుకుంది. రమణదీప్ సింగ్ (1), రఘువంశీ (5), రస్సెల్ (7) తక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరారు. రింకూ సింగ్ 38 (15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలు), హర్షిత్ రాణా 10 (9 బంతుల్లో 2 ఫోర్లు) చివరిలో మెరుపులు మెరిపించిన ఫలితం లేకుండా పోయింది. లఖ్‌నవూ బౌలర్లలో ఆకాశ్‌దీప్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు తీయగా, అవేశ్‌ఖాన్, దిగ్వేష్ సింగ్, రవి బిష్ణోయ్ తలో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. సూపర్ ఫామ్‌లో ఉన్న మిచెల్ మార్ష్ (81బీ 48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సలు) ఈ సీజన్‌లో నాలుగో అర్ధ శతకం నమోదు చేశాడు. వన్‌డౌన్ బ్యాటర్ నికోలస్ పూరన్ (87లిబీ 36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సలు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఐదెన్ మార్క్రమ్ (47బీ 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు) దూకుడుగా ఆడి త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. కోల్‌కతా బౌలర్లలో హర్షిత్ రాణా 2, ఆండ్రీ రస్సెల్ ఒక వికెట్ పడగొట్టారు.వైభవ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మూడే పరుగులు రాగా.. ఆ తర్వాత మార్క్రమ్, మార్ష్ దూకుడు మొదలెట్టారు. స్పెన్సర్ జాన్సన్‌ను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదారు. జాన్సన్ వేసిన మొదటి రెండు ఓవర్లలో 30 పరుగులు రాబట్టారు. హర్షిత్ రాణా బౌలింగ్‌లో లఖ్‌నవూ ఓపెనర్లు చెరో సిక్స్ బాదారు. నరైన్ బౌలింగ్‌లో మార్ష్ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. ఈ క్రమంలో 10 ఓవర్లకు స్కోరు 95/0గా నమోదైంది. హాఫ్ సెంచరీకి చేరువైన మార్క్రమ్‌ను హర్షిత్ రాణా ఔట్ చేసి కోల్‌కతాకు ఉపశమనాన్ని అందించాడు. అదే ఓవర్‌లో ఫోర్ బాది మార్ష్ అర్ధ శతకం అందుకున్నాడు. తర్వాత వచ్చిన పూరన్ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. మార్ష్ కూడా దంచికొట్టడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ జోడీ 11-15 ఓవర్ల మధ్య ఏకంగా 64 పరుగులు రాబట్టింది. దూకుడుగా ఆడుతున్న మార్ష్‌ను రస్సెల్ వెనక్కి పంపాడు. తర్వాత హర్షిత్ బౌలింగ్‌లో పూరన్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రస్సెల్ వేసిన 18 ఓవర్‌లో పూరన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ ఓవర్‌లో అతను వరుసగా 4, 0, 4, 6, 4, 6 బాదేశాడు. చివరి రెండు ఓవర్లలో 21 పరుగులు వచ్చాయి.

# బ్యాటర్ల ఊచకోత... లక్నో భారీ స్కోర్

**ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఎల్ఎస్‌జీ, కేకేఆర్ మ్యాచ్**

**లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోర్**

**విధ్వంసం సృష్టించిన మార్ష్ (81), పూరన్ (87 నాటౌట్)**



**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న ఐపీఎల్ 21వ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) బ్యాటర్లు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) బౌలర్లను ఊచకోత కోశారు. దీంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ ప్రారంభించిన లక్నోకు ఓపెనర్లు మార్క్రమ్, మిచెల్ మార్ష్ ఏకంగా 99 పరుగుల భాగస్వామ్యం అందించడం విశేషం. వేగంగా ఆడే క్రమంలో మార్క్రమ్ 28 బంతుల్లో 47 పరుగుల చేసి, తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్... మార్ష్ విధ్వంసం సృష్టించారు. వరుస బౌండరీలతో కేకేఆర్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. మార్ష్ 48 బంతుల్లోనే 81 రన్స్ చేసి ఔటయ్యాడు. అతని తుపాన్ ఇన్నింగ్స్ లో 5 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. ఈ ద్వయం 5 ఓవర్లలోనే రెండో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం గమనార్హం. చివర్లో పూరన్ ఊచకోత మరో స్థాయికి చేరింది. అతడు అజేయంగా 36 బంతుల్లో 8 సిక్సులు, 7 ఫోర్లతో 87 పరుగులు చేశాడు. కోల్‌కతా బౌలర్లలో హర్షిత్ రాణా 2 వికెట్లు తీస్తే... ఆండ్రీ రస్సెల్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్ లో కేకేఆర్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది.

# పంజాబ్ కింగ్స్ ఘన విజయం.. చెన్నైకు వరుసగా నాలుగో ఓటమి!



ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగుతుంది. చండీఘర్ వేదికగా మంగళవారం (ఏప్రిల్ 8) చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 18 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో నాలుగు మ్యాచ్ ల్లో పంజాబ్ కు ఇది మూడో గెలుపు కాగా.. ఐదు మ్యాచ్ ల్లో చెన్నైకి ఇది నాలుగో ఓటమి. భారీ ఛేజింగ్ లో కాన్వే (49 బంతుల్లో 69: 6 ఫోర్లు, 2 సిక్సర్లు), దూబే (42) పోరాడినప్పటికీ.. లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు మాత్రమే చేయగలిగింది.

220 పరుగుల లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్ ను ధాటిగా ప్రారంభించింది. ఓపెనర్లు రచిన్ రవీంద్ర (36), డెవాన్ కాన్వే తొలి వికెట్ కు 39 బంతుల్లో 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. పవర్ ప్లే తర్వాత 36 పరుగులు చేసిన రచిన్ రవీంద్ర మ్యాక్స్ వెల్ బౌలింగ్ లో స్టంపౌటయ్యాడు. ఈ టోర్నీలో పేలవ ఫామ్ లో ఉన్న గైక్వాడ్ ఒక పరుగే చేసి పెవిలియన్ కు చేరాడు. దీంతో చెన్నై స్వల్ప వ్యవధిలో 2 వికెట్లు కోల్పోవడంతో కష్టాల్లో పడింది. ఈ దశలో చెన్నై సూపర్ కింగ్స్ ను కాన్వే,

శివమ్ దూబే ఆదుకున్నారు. మూడో వికెట్ కు 89 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి పరిస్థితిని చక్కదిద్దారు. అయితే కొట్టాల్సిన రన్ రేట్ ఎక్కువగా ఉండడంతో వేగంగా ఆడడంలో ఈ జోడీ విఫలమైంది. దీంతో దూబే భారీ షాట్ కు ప్రయత్నించి బౌల్డయ్యాడు. మరో ఎండ్ లో కాన్వే 37 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నా వేగంగా ఆడలేకపోయాడు. దీంతో చెన్నై లక్ష్యానికి చాలా దూరంలో ఆగిపోయింది. ఇక ఎప్పటిలాగే ధోనీ (12 బంతుల్లో 2 సిక్సర్లతో 27) చివర్లో మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకుండా పోయింది. పంజాబ్ బౌలర్లలో లాకీ ఫెర్గుసన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. యష్ ఠాకూర్, మ్యాక్స్ వెల్ కు తలో వికెట్ లభించింది.

అంతక ముందు మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ప్రియాంష్ ఆర్య(42 బంతుల్లో 103:7 ఫోర్లు, 9 సిక్సర్లు) సెంచరీతో దుమ్మురేపడంతో పాటు శశాంక్ సింగ్(36 బంతుల్లో 52: 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు హాఫ్ సెంచరీ తోడవడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రియాంష్ ఆర్య టాప్ స్కోరర్ గా నిలిచాడు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో ఖలీద్ అహ్మద్, రవి చంద్రన్ అశ్విన్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. ముకేశ్ చౌదరీ, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.

## చిత్రాలలో సమంత జీవితం: 'వెనక్కి వెళ్లలేను, రిస్క్ తీసుకోవాలి'



# 'ఉప్పెన' బ్యూటీకి టాలీవుడ్ సెకెండ్ ఛాన్స్!



నేచురల్ స్టార్ నాని ప్యారడైజ్ ఆన్ సెట్స్ కి వెళ్లకుండా గ్లింప్స్ తో ఏ రేంజ్ లో షేక్ చేస్తోందో తెలిసిందే. నాని మాస్ లుక్....గ్లింప్స్ తో అంచనాలు తారా స్థాయికి చేరిపోయాయి. శ్రీకాంత్ ఓదెల నాని ని ఎలా చూపిం చబోతున్నాడు? అన్న ఆసక్తి అంతకంతకు పెరిగిపోతుంది. అయితే ఇందులో హీరోయిన్ ఎవరు? అన్నది ఇంతవరకూ క్లారిటీ లేదు. ఫోకస్ అంతా నాని రోల్ వైపు ఉండటంతో ఇప్పటి వరకూ ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. చిత్రీకరణ మొదలవుతోన్న నేపథ్యంలో హీరోయిన్ పై ఆసక్తి మొదలైంది.

ఈ నేపథ్యంలో నానికి జోడీగా చాక్లెట్ బ్యూటీ కృతిశెట్టిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. శ్రీకాంత్ రాసిన పాత్రకు కృతిశెట్టి పర్ఫెక్ట్ గా సెట్ అవుతుందట. దీంతో ఆమె ఎంట్రీ దాదాపు ఖాయమైనట్లే తెలుస్తోంది. కృతిశెట్టికిది గొప్ప అవకాశమనే చెప్పాలి.%-% ఉప్పెన%-% తర్వాత అమ్మడు కొన్ని సినిమాలు చేసినా కలిసి రాలేదు.

దీంతో కోలీవుడ్ కి వెళ్లిపోయింది. అక్కడా పరిస్థితి నత్త నడకనే సాగుతోంది. టాలీవుడ్ లో ప్రయత్నాలు చేస్తున్నా రావడం లేదు. సరిగ్గా ఇలాంటి టైమ్ లో ప్యారడైజ్ లో శ్రీకాంత్ ఛాన్స్ ఇవ్వడం ఇంట్రెస్టింగ్ గా మారింది. కృతి శెట్టి మంచి పెర్ఫార్మర్ అని తొలి సినిమా 'ఉప్పెన'తోనే ప్రూవ్ చేసింది. కానీ కాలం కలిసి రాకపోవడంతో స్టార్ లీగ్ లో చేరలేకపోయింది. కానీ ఇప్పుడా సెకెండ్ ఛాన్స్ మళ్లీ వచ్చింది. భారీ హైప్ ఉన్న చిత్రంలో ఛాన్స్ అందుకున్న నేపథ్యంలో కృతి పేరు టాలీవుడ్ లో మళ్లీ మారు మ్రోగుతోంది. ఈ సినిమా లైన్ లో ఉండగా కొత్త అవకాశాలు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం కోలీవుడ్ లో మూడు సినిమాలు చేస్తోంది. మూడు ఆన్ సెట్స్ లో ఉన్నాయి. ఇంతలోనే టాలీవుడ్ ఛాన్స్ తలుపు తట్టింది.



స్టైలిష్ గ్రీన్ డ్రెస్‌లో సంయుక్తా మీనన్ ఆకట్టుకుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com